

కౌంటర్ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న ఉద్యోగులు

## నేటి ఉదయం నుంచి సాయంత్రం వరకు

# ఓట్ల 'పండుగ'..!

అశ్వారావుపేట, నవంబర్ 29: అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల అధికారులకు సామగ్రిని స్థానిక వ్యవసాయ కళాశాలలో రిటర్నింగ్ ఆఫీసర్ రాంబాబు బుధవారం పంపిణీ చేశారు. ఆ సామాగ్రితో అధికారులు ప్రత్యేక బస్సుల్లో తమకు కేటాయించిన పో లింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ గురువారం ఉదయం 7.00 గంటలకు ప్రారంభమై, సాయంత్రం 4.00కు ముగుస్తుంది. పోలీసులు 144 సెక్షన్ విధించా రు. పోలింగ్ ముగిసిన వెంటనే అధికారులు ఈవీఎంల ను పోలీస్ బందోబస్తుతో స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుస్తారు. నియోజకవర్గంలోని ఏడు సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక రక్షణ బలగాలు బందోబస్తు నిర్వహిస్తున్నాయి.

**పండుగ వచ్చిందంటే..**
**ఎక్కడెక్కడో ఉన్నోళ్లంతా సొంతూరికి వస్తారు.**
**ప్రతి ఇంటి నుంచి కనీసంగా ఒక్కరైనా**
**గుడికో/మసీదుకో/చర్చికో వెళ్లొస్తారు.**
**ఆ రోజంతా సందడిగా గడుపుతారు.**
**ఏ పండుగైనా.. ఏడాదికోసారో వస్తుంది.**
**కానీ.. ఐదేళ్లకోసారి వచ్చే 'పండుగ' ఒకటి**
**ఉంది. తెలంగాణలో అది ఈరోజు (గురువారం)**
**వచ్చింది. అదే.. 'ఓట్ల పండుగ'..!**
**దీని ఏర్పాట్లు ఎలా ఉన్నాయో చూద్దాం.**

### మహిళా ఓటర్లే ఎక్కువ

గిరిజన నియోజకవర్గమైన అశ్వారావుపేటలో మొత్తం ఓటర్లు 1,55,961 మంది ఉన్నారు. వీరిలో అత్యధికంగా 79,761 మంది మహిళలు, 76,193 మంది పురుషులు, ఇతరులు ఏడుగురు ఉన్నారు. నియోజకవర్గం లోగల ఐదు మండలాల్లోని 124 ప్రాంతాల్లో 184 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

### 880 మంది సిబ్బంది

నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు మొత్తం 880 మంది ఉద్యోగులు నియమితులయ్యారు. వీరిలో పీవోలు 220 మంది, ఏపీవోలు 220 మంది, ఓపీవోలు 440 మంది ఉన్నారు. పోలీస్ శాఖ నుంచి మరో 480 మంది విధుల్లో ఉన్నారు. వీరిలో ఇద్దరు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, 11 మంది ఎస్సైలు ఉన్నారు. సీఆర్‌పీఎఫ్ బృందాలు ఆరు, టీఎస్‌పీఎస్ బృందాలు ఐదు, ఛత్తీస్‌గఢ్ నుంచి 60 మంది హోంగార్డులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు.

### ఏడు సమస్యాత్మక గ్రామాలు

నియోజకర్గంలో ఏడు గ్రామాలను సమస్యాత్మకంగా అధికారులు గుర్తించారు. వీటిలో ప్రత్యేక బలగాలతో బందోబస్తు ఏర్పాటైంది. ఈ సమస్యాత్మక గ్రామాల్లో అశ్వారావుపేట మండలంలోని రామన్నగూడెం, గాండ్లగూడెం, కన్నాయిగూడెం, కావడిగుండ్ల, దమ్మపేట మండలంలోని రెడ్వాలపాడు, మొద్దులగూడెం (ఈ గ్రామంలోని 105, 106 పోలింగ్ కేంద్రాలు) ఉన్నాయి.



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు బస్సులో వెళ్తున్న ఉద్యోగులు



పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న అధికారులు, సిబ్బంది



అన్నపురెడ్డిపల్లి: పోలింగ్ కేంద్రానికి వస్తున్న ఎన్నికల సిబ్బంది



అన్నపురెడ్డిపల్లి: పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది



అశ్వారావుపేట టౌన్: పోలింగ్ కేంద్రం వద్ద ముగ్గులు

## రండి.. రండి.. రండి..

# దయచేయండి..!

అశ్వారావుపేట టౌన్, నవంబర్ 29: 'రండి.. రండి.. రండి.. దయచేయండి..' అంటూ ఓటర్లకు స్వాగతం పలికేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద అధికారు లు, సిబ్బంది సిద్ధమయ్యారు. ఈ 'ఓట్ల పండుగ'కు వచ్చే ఓటర్లను స్వాగతిస్తున్నట్లుగా స్థానిక ఐకేపీ కార్యాలయంలోని 159వ కేంద్రం, మరికొన్ని కేంద్రాల ప్రవేశ ద్వారాల ముంగిటను ముగ్గులతో అలంకరించారు.

### దమ్మపేట మండలంలో...

దమ్మపేట, నవంబర్ 29: ఏజెన్సీ మండలమైన దమ్మపేటలో 52 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. 52 మంది పీవోలు, 52 మంది ఏపీవోలు, 114 మంది ఓపీవోలు విధుల్లో ఉన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో భారీ బందోబస్తు ఏర్పాటైంది.

### చండ్రుగొండ మండలంలో...

చండ్రుగొండ, నవంబర్ 29: మండలంలోని 27 పోలింగ్ కేంద్రాల్లో 22,785 మంది ఓటర్లు ఉన్నారు. ఏర్పాట్లు పూర్తయ్యాయి.

### అశ్వారావుపేట మండలంలో...

అశ్వారావుపేట రూరల్, నవంబర్ 29: మండలంలోని 30 పంచాయతీల్లో 45,765 మంది ఓటర్లు ఉన్నారు. ఏర్పాట్లను ఎన్నికల ప్రత్యేకాధికారి రాంబాబు, పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ పర్యవేక్షించారు.

### అన్నపురెడ్డిపల్లి మండలంలో...

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 29: మండలంలోని 20 పోలింగ్ కేంద్రాల్లో 16,555 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల సిబ్బంది 100 మంది, పోలీస్ సిబ్బంది 50 మంది విధులు నిర్వహిస్తున్నారు.



దమ్మపేట: ఎన్నికల సామగ్రితో ఎన్నికల సిబ్బంది



అశ్వారావుపేట: ఆసుపాక కేంద్రంలో సిబ్బంది

# ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి

టేకులపల్లి, నవంబర్ 29: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినయోగం చేసుకోవాలి, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ అమూల్యమైన ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం మండలం వ్యాప్తంగా ఉన్న 44 పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాట్లను సీఐ ఇంద్రసేనారెడ్డి, టేకులపల్లి, బోడు ఎస్సైలు గన్‌రెడ్డి రమణారెడ్డి, రంజిత్‌కుమార్‌తో కలిసి పర్యవేక్షించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల ప్రక్రియ చాలా కీలకమైందన్నారు. ప్రశాంత వాతావరణంలో జరిగే ఎన్నికలకు భంగం కలిగిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని హెచ్చరించారు. ఏ చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఓటర్లు ఎవ్వరూ సెల్ ఫోన్లు, మందుగుండు సామగ్రి, ఇంక్ బాటిల్స్, వాటర్ బాటిల్స్ పోలింగ్ బూత్‌లోకి తీసుకువెళ్లకూడదన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సెల్ఫీలు దిగడం నిషేదమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.